క్లుప్తంగా

ఎయిడ్స్ వ్యాధిపై కళాజాత బృందం అవగాహన



మార్కాపురం: ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ (హెచ్ ఓసీ) సొసైటీ ఆధ్వర్యంలో శనివారం గడియార స్తంభం సెంటర్‌లో కళాజాత బృందాలు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎయిడ్స్ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కండోమ్ వాడకాన్ని వివరించారు. వ్యాధి సోకితే మందులు ఏఆర్‌టీ సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిపై కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌జీవో ప్రాజెక్టు డైరెక్టర్ టీ ఆనంద్ బెంజిమెన్, సీపీఎం కిరణ్, విజయకుమారి, ఆలియా భాను, విజయకుమారి, షభాన, రేణుక, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులకు సరైన గుణపాఠం చెప్పిన దేశం



గిద్దలూరు రూరల్: పహల్గామ్‌లో ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా చేసినందుకు గాను శనివారం బీజేపీ నాయకులు శనివారం పట్టణంలోని పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కిసాన్ మోర్చ కార్యవర్గ సభ్యుడు పిడతల రమేష్‌రెడ్డి మాట్లాడుతూ పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులను సమూలంగా నాశనం చేసేందుకు ప్రభుత్వం శక్తి వంచన లేకుండా పనిచేస్తుందన్నారు. దేశంలోని ప్రజలందరూ కులమతాలకు అతీతంగా దేశ రక్షణ వ్యవస్థకు పూర్తిగా మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ నారాయణ, పంట శివమల్లారెడ్డి, దూదేకుల బాదుల్లా, కొప్పుల నరసింహులు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన ఎంవీఐ



పొదిలి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఒంగోలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్, ఆర్టీసీ డిపో మేనేజర్ శంకరరావుతో కలిసి తనిఖీలు నిర్వహించారు. వాహనాల పత్రాలు పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ప్రధానంగా ఆటోలు, మ్యాజిక్ వాహనాలను తనిఖీ చేశారు. ఫిట్‌నెస్ లేని ప్రైవేటు వాహనాలలో ప్రయాణికులు ఎక్కవద్దని, ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలని డీఎం శంకర్‌రావు కోరారు.

70 మందికి వైద్య పరీక్షలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛఆంధ్ర-స్వర్ణాంధ్ర దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో 70 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సత్తా చాటిన బల్లికురవ ఎడ్లు



బేస్తవారిపేట: మండలంలోని పీవీ పురంలో పేరంటాలమ్మ-పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా శనివారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరస్వామి చౌదరి ఎడ్లు 2354 అడుగుల దూరం లాగి మొదటిస్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా జిల్లెలకు చెందిన గొటికె ధనేష్‌రెడ్డి ఎడ్లు 2351 అడుగులతో ద్వితీయ, మార్కాపురం మండలం బొడిచర్ల టి. నక్షత్రరెడ్డి ఎడ్లు 2063 అడుగులు, బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారం లక్కు నాగశివశంకర్ ఎడ్లు 1765 అడుగులతో, నంద్యాల జిల్లా పెసరవాయి కలాం బాష ఎడ్లు 1593 అడుగులు, బాపట్ల జిల్లా పీవీఎస్ఆర్ ఎడ్లు 1577, గిద్దలూరుకు చెందిన దుర్వాసుల అశ్విని ఎడ్లు 1352, బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారంకు చెందిన లక్కు మునీశ్వరయ్యా ఎడ్లు 500 అడుగులతో వరుస స్థానాలు సాధించాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3500 బహుమతులను గ్రామపెద్దలు పంపిణీ చేశారు.

తాగి నడపకు.. జైలుకు వెళ్లకు !



బ్రీత్ ఎనలైజర్‌తో టెస్ట్ చేస్తున్న వన్‌టౌన్ ఎస్సై సైదుబాబు



బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న టూటౌన్ ఎస్సై రాజమోహన్‌రావు

- మద్యం తాగి వాహనం నడిపితే నేరుగా జైలుకే
- మార్కాపురంలో 4 నెలల్లో 100 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు
- మందుబాబులకు భారీ స్థాయిలో జరిమానాలు

మార్కాపురం: పాపం.. తాగుబోతు కష్టాలు అంతా ఇంతా కాదు. రాత్రయితే చాలు పోలీసులు ఎక్కడి నుంచి వస్తారో అని తెలియక భయం భయంగా తిరుగుతున్నారు. ఒక పక్క బాగా తాగండని ప్రభుత్వం ప్రోత్సహిస్తుంటే.. ఇటు తాగి మీరెందుకు రోడ్ల మీదకు వస్తున్నారని పోలీసులు భరతం పడుతున్నారని తాగుబోతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మందుబాబులపై మార్కాపురం పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజల రాకపోకల సమయాల్లో ఇబ్బంది పెడుతున్న తాగుబోతులపై కేసులు నమోదు చేస్తూ కోర్టులో హాజరు పరుస్తుండటంతో కొందరికి జైలుశిక్ష, మరికొందరికి భారీ జరిమా[illegible]ం పట్టణంతోపాటు పరిసర గ్రా[illegible] అందుబాటులో ఉండటంతో మద్యం తాగేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీనితోపాటు వారి ఆగడాలు ఎక్కువయ్యాయి. మద్యం తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీనితో మార్కాపురం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పట్టణ, రూరల్ ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు, అంకమరావుతోపాటు వారి సిబ్బంది గత 4 నెలల నుంచి ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకూ పట్టణ శివారు ప్రాంతాలైన వై జంక్షన్, రైల్వేస్టేషన్ రోడ్డు, అల్లూరి పోలేరమ్మ గుడి, వేములకోట బ్రిడ్జి, కోమటికుంట వద్ద స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్నారు. బ్రీత్ ఎనలైజర్ ద్వారా మద్యం తాగిన వారిని గుర్తించి కేసులు నమోదుచేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. దీనితో పలువురికి జైలు శిక్ష పడుతుండగా, మరికొందరికి భారీ జరిమానాలు పడుతున్నాయి. నాలుగు నెలల్లో దాదాపు 100 కేసులను నమోదు చేశారు. దీనితో తాగి బండి నడపాలన్నా.. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగాలన్నా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా వన్‌టౌన్, టూటౌన్ ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావులు ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

నాలుగు నెలల్లో కేసులు ఇలా..

జనవరి	22
మార్చి	28
ఏప్రిల్	21
మే	20 (15 మే వరకు)

97 కేసులు నమోదు..



గడిచిన నాలుగు నెలల కాలంలో మద్యం తాగి ఇబ్బంది పెడుతున్న 97 మందిపై కేసులు నమోదు చేశాం. తాగి బయట తిరిగితే కేసులు ఎదుర్కోవాల్సిందే.. జరిమానా కట్టాల్సిందే. ఒక్క గురువారం రోజునే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురిలో నలుగురికి రూ. 10 వేలు, మరొకరికి రూ.5 వేల రూపాయల జరిమానా కోర్టు విధించింది.

– పి సుబ్బారావు, సీఐ, మార్కాపురం

అటు పార్కింగ్.. ఇటు కష్టాలు



బస్టాండు ముందు నిలిచిన వాహనాలు

- కంభం బస్టాండులో జటిలంగా మారిన ట్రాఫిక్ సమస్య
- గతంలో పోలీసులు మార్కింగ్ వేసినా లెక్క చేయని దుకాణదారులు

కంభం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జటిలంగా మారితోంది. బస్టాండ్ సమీపంలోని దుకాణదారులందరూ తమ వస్తువులను రోడ్లపైకి ఉంచడం, ఆటోలు, ద్విచక్రవాహనాలు రోడ్డుపైనే పెడుతుండటంతో సమస్య రోజురోజుకు తీవ్రతరమవుతోంది. ఆర్టీసీ బస్సులు బస్టాండులోకి వెళ్లి మలుపుకోడానికి డ్రైవర్లు అవస్థలు పడుతుండటంతోపాటు ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. బస్టాండు సమీపంలో రెండు మద్యం దుకాణలు ఉండటంతో అక్కడి వచ్చే మందు బాబులు రోడ్డుపైకి వాహనాలు పెడుతున్నారు. మూడు నెలల క్రితం ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలన్న ఉద్దేశంతో పోలీసులు తోపుడు బండ్లవారికి, దుకాణాల వారికి పలుదఫాలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం పంచాయతీ అధికారుల సహకారంతో



మూడునెలల క్రితం దుకాణాల ముందు మార్కింగ్ వేయిస్తున్న పోలీసులు (ఫైల్)

బస్టాండ్ సమీపంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న దుకాణాల ముందు మార్కింగ్ వేయించిన పోలీసులు దుకాణాల్లోని వస్తువులు, బోర్డులు, ద్విచక్ర వాహనాలు ఏవైనా సరే గీత లోపలికే ఉండాలని హెచ్చరించారు.

గీత దాటితే కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. పోలీసుల హెచ్చరికలను బేఖాతారు చేస్తూ దుకాణదారులు ఇష్టానుసారంగా బోర్డులు, వస్తువులు పెట్టుకోవడం, వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్ తీవ్ర సమస్య ఏర్పడుతుంది. పోలీసులు స్పందించి చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

దివ్యాంగులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

పొదిలి రూరల్: అర్హులైన దివ్యాంగులకు బీసీ, ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్‌లకు సంబంధించిన సబ్సిడీ రుణాలు.. ప్రభుత్వ జీవో 43 ప్రకారం 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి అధ్యక్షుడు ముల్లా మదార్‌వలి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఈదర విజయలక్ష్మికి వినతిప్రత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పొదిలి మండలంలో అర్హులైన దివ్యాంగులు బ్యాంకుల్లో రుణాలు పొందాలంటే చాలా కష్టంగా ఉందన్నారు. బ్యాంకుల్లో దివ్యాంగులు మీరు ఏవిధంగా రుణాలు చెల్లిస్తారని తమ ఆత్మ గౌరవాన్ని కించపరచే విధంగా మాట్లాడుతున్నారు. సచివాలయాల్లో దివ్యాంగులకు అనువుగా ర్యాంపులు, వీల్‌చైర్లు, ఏర్పాటు చేయాలని కోరారు.



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న మదార్‌వలి

రంగనాయకస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

రాచర్ల: నల్లమల అటవీ ప్రాంతం మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. ఆలయం సమీపంలోని నీటిగుండంలో స్నానాలు అచరించి, క్యూలో స్వామి దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు అన్నవరం పాండురంగచార్యులు, సత్యనారాయణ చార్యులు అధ్వర్యంలో స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూల అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు కృష్ణదేవరాయల కాపు బలిజ, గోపాలకృష్ణ యాదవ, కాశినాయన, యోగి వేమన రెడ్ల, ఆర్యవైశ్య అన్నదాన సత్రాల్లో అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.



స్వామి దర్శనం కోసం క్యూలో వేచిఉన్న భక్తులు

భవిష్యత్ తరాలకు నీరందించాల్సిన బాధ్యత మనదే

మార్కాపురం టౌన్: భవిష్యత్ తరాలకు నీటిని సంరక్షించి అందించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం కళాశాలలో 'నీరు-మీరు' పేరుతో నీటి సంరక్షణపై విద్యార్థులకు ప్రిన్సిపాల్ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరికి నీటి విలువ అర్థమయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో బాధ్యతను పెంచుతుందన్నారు. నీటి వనరులను రక్షించడం మనందరి కర్తవ్యమని తెలిపారు. వర్షం నీటిని ఒడిసిపట్టే కట్టడాలను శుభ్రం చేయడం, కొత్త ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలన్నారు. నీటి వాడకాన్ని గమనించేందుకు స్కోర్ కార్డులను తయారు చేయడం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ అనిల్ కుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

గిద్దలూరులో వర్షం

గిద్దలూరు రూరల్: వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఒకసారిగా గిద్దలూరులో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వేసవిలో వర్షం కారణంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వర్షం కారణంగా పట్టణంలోని కోటగడ్డవీధి, అంకాలమ్మ బజారు, రాజానగర్, శ్రీరామ్‌నగర్, నల్లబండ బజారుల్లో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోయాయి. డ్రైనేజి కాలువల్లో నుంచి మురికి నీరు రోడ్ల మీదకు వచ్చి చేరుకుంది. దీంతో విద్యుత్‌శాఖ అప్రమత్తమై కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వర్షం ముగిసిన తరువాత విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

తూతూ మంత్రంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర



కంభంలో ప్రతిజ్ఞ చేస్తున్న రెవిన్యూ, పంచాయతీ అధికారులు



పొదిలిలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



కొమరోలులో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞలో పాల్గొన్న హెల్త్, అంగన్‌వాడీ సిబ్బంది

- జనాలు లేకుండానే కార్యక్రమం
- ఫొటోలకు పోజులతోనే సరిపెట్టిన అధికారులు

కంభం: స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. శనివారం కంభంలో 'బీట్ ది హీట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో వీరభద్రాచారి మాట్లాడుతూ వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉపాధి శ్రామికులు పనులు ఉదయం త్వరగా మొదలు పెట్టి పనులు పూర్తి చేసుకోవాలన్నారు. పని ప్రదేశంలో మంచినీరు, ఓఆర్ఎస్, మజ్జిగ అందుబాటులో ఏర్పాటు చేయాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కంభం పంచాయతీ కార్యాలయంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీ కిరణ్, సర్పంచ్ పల్నాటి బోడయ్య, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శి రమేష్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమాలు సరే.. ప్రజలు ఎక్కడా ?

కొమరోలు: స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 3వ శనివారం మండల కేంద్రమైన కొమరోలులో గ్రామ సచివాలయం-1లో అవగాహన కార్యక్రమాలను ప్రజలకు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వారికి అవగాహన పరుస్తూ పరిశుభ్రతపై కార్యక్రమాలను చేపట్టాలి. కానీ కొమరోలులోని మండల స్థాయి అధికారులు, మండల ప్రత్యేక అధికారి వీటన్నింటిని విస్మరించి కేవలం అధికారులు కార్యక్రమాలలో పాల్గొంటూ మమ అనిపిస్తున్నారు. కొమరోలులోని గ్రామ సచివాలయంలో శనివారం మొదటిసారిగా మండల ప్రత్యేక అధికారి, సివిల్ సప్లయి డిస్ట్రిక్ట్ మేనేజర్ వరలక్ష్మి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కొమరోలు గ్రామసచివాలయం-1లో వేసవి కాలం ముగిసే సమయంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఆ కార్యక్రమాన్ని వరలక్ష్మీ ప్రారంభించారు. అదే కార్యాలయ ఆవరణలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు చలి వేంద్రం..

పొదిలి రూరల్: ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఈదర విజయలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శోభన్‌బాబు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, రవిచంద్రరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో బొల్లి రమణారెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని కేఎస్ పల్లె గ్రామంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ చెన్నారావు, ఏపీఎం రమణి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: తహశీల్దార్ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్యాలయం ఆవరణలో తహశీల్దార్ చిరంజీవి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యాలయ ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించి శుభ్రం చేశారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం



ఎంపీడీవోను నిలదీస్తున్న జెడ్పీటీసీ ఇందిర

- ప్రజాప్రతినిధులకు మర్యాద ఇవ్వడం లేదంటూ మండిపాటు

తర్లుపాడు: జవాబుదారితనంగా ఉండాల్సిన అధికారులు సమస్యలపై పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ భూలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తీవ్ర ఉద్రిక్తలకు కారణమైంది. తమను కాదని గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన వ్యక్తులకు ప్రాధాన్యత ఇస్తూ తమ పట్ల పంచాయితీ, మండల స్థాయి అధికారులు అమర్యాదగా వ్యవహరిస్తున్నారంటూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంబుక్ చేయకుండా నెలల పాటు ప్రజా ప్రతినిధులను కార్యాలయాల చుట్టూ తిప్పుకునే అధికారం మీకెవరిచ్చారో చెప్పాలంటూ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని పోతలపాడు సర్పంచ్ శ్రీనివాసరెడ్డి నిలదీశారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో తీవ్ర అవినీతి జరుగుతుందని కేతగుడిపి సర్పంచ్ పెద్దమస్తాన్ ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ అధికార పార్టీ నాయకుల కోసం నీటి ట్యాంకులు వినియోగిస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని చెన్నారెడ్డిపల్లి సర్పంచ్ కుందురు వెంకట సుబ్బులు సభ దృష్టికి తెచ్చారు. ఎస్సీ హాస్టల్ ఎదురుగా ఉన్న బజారులో పారిశుధ్యం అధ్వానంగా ఉందని కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ సభ దృష్టికి తెచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులమైన తమ పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కేతగుడిపి సర్పంచ్ పెద మస్తాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండు నెలలుగా గ్రామంలో మూడు డీప్ బోర్లు పని చేయడం లేదని సీతానాగులవరం సర్పంచ్ ఆంజనేయులు సభ దృష్టికి తెచ్చారు. ఒక పక్క సర్వసభ్య సమావేశం రసాభాసగా జరుగుతుంటే తనకిదేమీ పట్టదన్నట్టు ఎంపీడీవో కునుకుతీయడం పలు విమర్శలకు తావిచ్చింది.

జెడ్పీటీసీ సభ్యురాలికి అవమానం..

తనకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా సర్వసభ్య సమావేశం ముగించడంతో జెడ్పీటీసీ వెన్న ఇందిర హనుమారెడ్డి ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీటిసి అయిన తనకే మాట్లాడే అవకాశం ఇవ్వకపోతే ప్రజల సమస్యలు ఏవిధంగా పరిష్కరిస్తారో అర్థమవుతుందని అన్నారు. జరిగిన అవమానంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పి సభనుంచి వాకౌట్ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ కిశోర్‌కుమార్, ఏవో చంద్రశేఖర్, వివిధశాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని పోలీసు స్టేషన్ రోడ్డులో ఎస్‌వీబీఎస్ డిగ్రీ కళాశాలలో శనివారం మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నంద్యాలకు చెందిన శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించగా 60 మంది చికిత్స చేపించుకున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు. ఆప్తాలమిస్టు ఆది కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్లు, అవసరమైన వారిని గుర్తించి త్వరలో ప్రత్యేక వాహనంలో శాంతిరామ్ వైద్యశాలకు తీసుకునివెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా శ్రీరామనామ సప్తాహం



వ్రతంలో పాల్గొన్న ఉభయదాతలు

కొనకనమిట్ల: సత్యనారాయణస్వామి సేవకు రారండి అంటూ మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలో వెలసిన రామదూత క్షేత్రంలో 13వ ద్వాదశ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకట రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా హోమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారి వ్రతం ఉభయ దాతలుగా పొదిలికి చెందిన దివ్వెల సుబ్రహ్మణ్యం, జ్యోతి, పేరం లక్ష్మినారాయణ, కుమారి, బొగ్గరపు శ్రీనివాసులు తదితరులు దంపతులుగా వ్యవహరించారు. ఆదివారం శ్రీరుక్మిణి సత్యభామ సహిత శ్రీవేణుగోపాలస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి నిర్వాహకులు యక్కంటి తిరుపతిరెడ్డి, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి, వెలిశెట్టి వెంకటనారాయణ, వేముల వెంకట సుబ్బారెడ్డి తెలిపారు.

25 మంది విద్యార్థుల హాజరు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరానికి 25 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి తెలిపారు. విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు వినిపించడం, స్పోకెన్ ఇంగ్లిషు, గ్రామర్, బొమ్మలు గీయడంపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గురుస్వామి పాల్గొన్నారు.